ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

విశాఖపట్నం కేంద్రం

ప్రాంతీయ వార్తలు

తేదీ: 08-02-2025 సమయం : సాయంకాలం 6 గం. 10 ని. లు

ముఖ్యాంశాలు

- వన్ నేషన్- వన్ ఎలక్షన్ తో అభివృద్ధి సాధ్యమని ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు అన్నారు.
- చట్టాల ద్వారా న్యాయవ్యవస్థపై నమ్మకాన్ని పెంచాలని సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సరస వెంకట నారాయణ భట్ తెలిపారు.
- అర్హులైన ప్రతి ఒక్కరికి ఇళ్ల స్థలాలను అందజేసేందుకు ప్రభుత్వం ప్రణాళికలు సిద్ధం చేస్తుందని మంత్రి ఎన్ఎండీ ఫరూక్ పేర్కొన్నారు.
- జాతీయ నులిపురుగుల దినోత్సవాన్ని విజయవంతం చేయాలని పార్వతీపురం మన్యం జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి డాక్టర్ ఎస్. భాస్కరరావు అధికారులకు సూచించారు.

===================

సంక్షేమం, అభివృద్ధి లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం పనిచేస్తోందని ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు అన్నారు. ఈరోజు అమరావతిలో పాత్రికేయులతో మాట్లాడుతూ, వన్ నేషన్- వన్ ఎలక్షన్ తో అభివృద్ధి సాధ్యమని, అందుకు ఢిల్లీ ఎన్నికలే ఒక ఉదాహరణ అని చెప్పారు. ఢిల్లీ ఎన్నికల్లో 27 ఏళ్ల తర్వాత బీజేపీ విజయం చరిత్రాత్మకమని పేర్కొన్నారు. పీపుల్ ఫస్ట్ అనే నినాదం అక్కడి ఎన్నికల్లో అమలయ్యిందని, ఆ నినాదమే బీజేపీని గెలిపించిందని ముఖ్యమంత్రి పేర్కొంటూ..

(వాయిస్ బైట్..35 సెకన్లు)-సెట్

===================

చట్టాల ద్వారా ప్రజల ప్రాథమిక హక్కులను కాపాడుతూ న్యాయవ్యవస్థపై నమ్మకాన్ని పెంచాలని సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సరస వెంకట నారాయణ భట్ తెలిపారు. ఈరోజు చిత్తూరు జిల్లాలోని పలమనేరు-బెంగళూరు రోడ్డులో సుమారు 15 కోట్ల 18లక్షల రూపాయలతో నూతనంగా నిర్మించిన నాలుగు కోర్టు భవనాల సముదాయాన్ని హైకోర్టు చీఫ్ జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాకుర్ తో కలిసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పలమనేరులో మెరుగైన మౌలిక సదుపాయాలతో న్యాయస్థాన భవనం నిర్మించడం మంచి పరిణామం అన్నారు. న్యాయవాదులలో నూతన ఉత్సాహాన్ని పెంపొందించడానికి, ప్రజలకు న్యాయవ్యవస్థపై నమ్మకం కలిగించేందుకు ఈ కార్యక్రమం దోహదపడుతుందన్నారు.

===================

ప్రతీఒక్కరూ సేవా దృక్పథాన్ని అలవర్చుకోవాలని భారత మాజీ ఉపరాష్ట్రపతి ఎం.వెంకయ్యనాయుడు పిలుపునిచ్చారు. విజయనగరం జిల్లా కొత్తవలస మండలం మంగళపాలెంలో ఓ సంస్థ వార్షికోత్సవానికి ఈరోజు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, మారుమూల ప్రాంతంలో ప్రజలకు సేవా కార్యక్రమాలను అందిస్తున్న ఆ సంస్థ సేవలను ప్రశంసించారు. కష్టసుఖాలను తోటివారితో పంచుకోవడం భారతీయ హైందవ సంస్కృతిలోనే ఉందని అన్నారు. సమాజంలో అట్టడుగు వర్గాన్ని ఆదుకోవాల్సిన బాధ్యత ప్రతీఒక్కరిపైనా ఉందని పేర్కొంటూ..

(వాయిస్ బైట్..27 సెకన్లు)-విజయనగరం

===================

జాతీయ నులిపురుగుల నిర్మూలన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పార్వతీపురం మన్యం జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి డాక్టర్ ఎస్. భాస్కరరావు అధికారులకు సూచించారు. ఈరోజు వైద్యాధికారులు, హెల్త్ సూపర్వైజర్లతో దృశ్య, శ్రవణ మాధ్యమం ద్వారా మాట్లాడుతూ.. జిల్లా వ్యాప్తంగా సోమవారం నిర్వహించనున్న డీ-వార్మింగ్ డే కార్యక్రమంలో 1

సంవత్సరం నుండి 19 సంవత్సరాల వయస్సు గల వారికి ఆల్బెండజోల్ మాత్రలు వేయించాలని తెలిపారు. అంగన్వాడీ కేంద్రాలు, పాఠశాలల్లో మధ్యాహ్న భోజనం తర్వాత అల్బెండజోల్ మాత్రలు తప్పనిసరిగా వేయించాలన్నారు.

===================

రానున్న వేసవిలో గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో తాగునీటి కొరత లేకుండా ముందస్తు ప్రణాళికలు చేపట్టామని పశ్చిమగోదావరి జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి తెలిపారు. భీమవరంలో ఈరోజు జలవనరుల శాఖ, రక్షిత మంచినీటి సరఫరా అధికారులతో ఆమె మాట్లాడుతూ జల్ జీవన్ మిషన్ ద్వారా త్రాగు నీరందించే పనులను త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. వాతావరణ శాఖ అంచనాల మేరకు ఈ సంవత్సరం అధిక ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశం ఉందని, తాగునీటి చెరువులకు అవసరమైన నీటిని ఎప్పటికప్పుడు నింపుకుని సిద్ధంగా ఉంచుకోవాలని కలెక్టర్ వివరించారు.

===================

విరామం

===================

ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికలతో ప్రధాని మోదీపై విశ్వాసం మరోసారి రుజువైందని జనసేన అధినేత, రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ అన్నారు. దిల్లీ ఎన్నికల్లో భారతీయ జనతా పార్టీ విజయం సాధించడంపై ఈరోజు అమరావతిలో పాత్రికేయులతో మాట్లాడుతూ, 2047 నాటికి భారత్ ను అభివృద్ధి చెందిన దేశంగా నిలిపేలా మోదీ పాలన సాగిస్తున్నారని పేర్కొన్నారు. ప్రధాని మోదీ నిర్దేశించిన లక్ష్యం అందుకోవడంలో దిల్లీ పాత్ర అత్యంత కీలకమని చెప్పారు. డబుల్ ఇంజిన్ సర్కార్ ద్వారా దేశ రాజధానిలో సమ్మిళిత అభివృద్ధి సాధ్యపడుతుందన్నారు. అమిత్ షా రాజకీయ అనుభవం, చాతుర్యం సత్ఫలితాలనిచ్చాయని పవన్ తెలిపారు. వైద్య, ఆరోగ్య శాఖా మంత్రి సత్యకుమార్ యాదవ్ మాట్లాడుతూ, ఢిల్లీ ఎన్నికల్లో బీజేపీ అఖండ విజయం ప్రధాని నరేంద్రమోదీ పట్ల ప్రజలకు ఉన్న అచంచల విశ్వాసానికి నిదర్శనమని పేర్కొన్నారు.

===================

అర్హులైన ప్రతి ఒక్కరికి ఇళ్ల స్థలాలను అందజేసేందుకు ప్రభుత్వం ప్రణాళికలు సిద్ధం చేస్తుందని రాష్ట్ర మైనార్టీ న్యాయ శాఖా మంత్రి ఎన్ఎండీ ఫరూక్ తెలిపారు. ఈరోజు నంధ్యాలలో తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో నిర్వహించిన ప్రజాదర్బార్ లో మంత్రి మాట్లాడుతూ, అర్హులైన వారికి ఇళ్ల స్థలాలు మంజూరు చేస్తామని, నూతన పెన్షన్లు, భూ సమస్యలకు సంబంధించి అర్జీలను లబ్ధిదారుల నుండి తీసుకున్నామని పేర్కొంటూ...

(వాయిస్ బైట్..28 సెకన్లు)-సెట్

===================

శ్రీశైలంలో అత్యంత వైభవంగా నిర్వహించే మహా శివరాత్రి బ్రహ్మోత్సవాలకు హాజరయ్యే భక్తులకు ఎటువంటి ఇబ్బంది కలగకుండా తగిన ఏర్పాట్లు చేయాలని రాష్ట్ర రోడ్లు భవనాలు, పెట్టుబడులు, మౌలిక సదుపాయాల శాఖా మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డి ఆలయ అధికారులను ఆదేశించారు. ఈరోజు అమరావతిలోని, శ్రీశైలం దేవస్థానం ఈవో ఎం. శ్రీనివాసరావు, ఆలయ పండితులు, మంత్రిని మర్యాదపూర్వకంగా కలిసి, శ్రీశైలంలో నిర్వహించే బ్రహ్మోత్సవాలకు ఆయన్ను ఆహ్వానించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, మహాశివరాత్రిని పురస్కరించుకుని శ్రీశైలంలో నిర్వహించనున్న బ్రహ్మోత్సవాల సన్నద్ధతపై ఈ నెల 10వ తేదీన శ్రీశైలం ఆలయ కమాండ్ కంట్రోల్ సెంటర్ లో మంత్రుల కమిటీ ఆధ్వర్యంలో సమీక్షా సమావేశం నిర్వహిస్తామని తెలిపారు. ఈ నేపథ్యంలో బ్రహ్మోత్సవాలకు జరుగుతున్న ఏర్పాట్లు, భక్తుల సౌకర్యార్థం తీసుకుంటున్న జాగ్రత్తలు, భద్రతా చర్యలపై ఆలయ ఈవోని.. మంత్రి, వివరాలు అడిగి తెలుసుకున్నారు.

===================

గిరిజనుల సంస్కృతి, సాంప్రదాయాలను ప్రతిఒక్కరూ అలవర్చుకోవాలని పార్వతీపురం మన్యం జిల్లా కలెక్టర్ ఏ. శ్యామ్ ప్రసాద్ అన్నారు. ఈరోజు జిల్లాలో పర్యటించిన ఆయన గిరిజనుల జీవన విధానాన్ని, సంస్కృతి, సాంప్రదాయాలను పరిశీలించారు. పర్యటనలో భాగంగా మారుమూల ప్రాంతమైన లొద్ద గ్రామాన్ని కలెక్టర్ సందర్శించి, అక్కడున్న గిరిజనులతో మాట్లాడారు. గిరిజనుల సాంప్రదాయక వస్త్రధారణ, తీసుకునే ఆహారం విధానాల గురించి వారిని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ లొద్ద ప్రాంతంలో పర్యాటక అవకాశాలు మరింత మెరుగుపరిచేందుకు చర్యలు చేపడతామని పేర్కొన్నారు.

===================

ప్రముఖ వాయులింగక్షేత్రం, శ్రీకాళహస్తిని మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలకు సర్వం సిద్ధం చేశామని తిరుపతి ఎమ్మెల్యే బొజ్జల సుధీర్ రెడ్డి తెలిపారు. మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల ఏర్పాట్లను పరిశీలించిన అనంతరం పాత్రికేయులతో మాట్లాడుతూ, ఈనెల 21వ తేదీ నుంచి మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు ప్రారంభం కానున్నాయని చెప్పారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఈనెల 25వ తేదీన శ్రీకాళహస్తికి చేరుకుని ప్రభుత్వం తరపున పట్టువస్త్రాలను సమర్పిస్తారని తెలియజేశారు.

===================

భీష్మ ఏకాదశి సందర్భాన్ని పురస్కరించుకుని పశ్చిమగోదావరి జిల్లా తణుకులో కొలువైన భూదేవి శ్రీదేవి సమేత శ్రీ కేశవ స్వామి వారి ఆలయానికి భక్తులు అధిక సంఖ్యలో హాజరై, ప్రత్యేక పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని దేవస్థానం అధికారులు, ఆలయ పాలకవర్గం ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.

===================

===================